
సాక్షి ఒడిశా

మంగళవారం । 30 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,55,647లు, బంగారం 360 మిల్లీగ్రాములు, వెండి73 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఒడిశాలోని సుమారు కోటి మంది గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలియజేశారు.

- 8లో



పెళ్లిపీటలెక్కనున్న దీప్ గ్రేస్ ఎక్కా

అంతర్జాతీయ హాకీ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన ఒడిశా హాకీ దిగ్గజం దీప్ గ్రేస్ ఎక్కా త్వరలో పెళ్లి కూతురు కానుంది.

- 8లో

న్యూస్‌రీల్

కొండచిలువ కలకలం



స్నేక్ హెల్ప్‌లైన్ సిబ్బంది పట్టుకున్న కొండచిలువ

బరంపురం: నగర శివారులోని హరఖండి వద్ద నున్న సుకుండా ఆలయంలో 20 అడుగుల కొండచిలువ సోమవారం కలకలం సృష్టించింది. దీంతో స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్నేక్ హెల్ప్‌లైన్ సిబ్బంది వచ్చి చాకచక్యంతో కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం దగ్గరలోని నారాయణి అడవిలో సురక్షితంగా విడిచిపెట్టారు.

నబరంగ్‌పూర్ జిల్లా బంద్ నేడు



మాట్లాడుతున్న కనుదాస్ తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో రైల్వేలైన్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా బంద్ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మానస్ రంజన్ దాస్(కను) సోమవారం తెలియజేశారు. అలాగే జిల్లాలోని రెండో పెద్ద పట్టణం ఉమ్మర్ కోట్‌లో బ్లడ్ బ్యాంక్, ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంద్ కొనసాగుతుందని వెల్లడించారు. సమావేశంలో పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుబజిత్ పాణిగ్రాహి, ఉపాధ్యక్షుడు బిక్కి జెన, సంయుక్త కార్యదర్శి అనంత్ పండా, శ్రీధర్ పాత్రోలు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'



పాండ్యన్‌తో సమావేశమైన జాదవ్ సమాజ్ సభ్యులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జాదవ్ సమాజ్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర 5టీ చైర్మన్ కార్తికేయ పాండ్యన్‌కు ఆ సంఘం విజ్ఞప్తి చేసింది. సోమవారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో సంఘం సభ్యులు నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జిని కలిశారు. అనంతరం ఎంపీ నేతృత్వంలో పాండ్యన్‌తో సమావేశమయ్యారు. తమ సంఘ భవనం కోసం జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాలని కోరారు. భవన నిర్మాణం కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం చేయాలని విన్నవించారు. దీనిపై పాండ్యన్ స్పందిస్తూ సమస్యల పరిష్కరం కోసం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు వివరిస్తానన్నారు. వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు



క్రీడాకారులతో అతిథులు, నిర్వాహకులు


రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఆదివారం నుంచి ప్రారంభమైన వంశధార వసంతోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు మినీ స్టేడియంలో సోమవారం వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ లలిత్ కుమార్ కుహరొ ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గత 11 ఏళ్లుగా అందరినీ ఆకట్టుకునేవిధంగా ఉత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందించారు. ఉత్సవాలు క్రీడాకారులు, కళాకారులకు నూతనుత్తేజం నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడా ఉత్సవాల నిర్వాహక కమిటీ అధ్యక్షుడు అక్షయ దాస్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొంటున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో గుణుపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడో తదితరులు పాల్గొన్నారు.

పెద్దల సభకు ఎవరో..?

- రాష్ట్రంలో 3 రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్
- ఫిబ్రవరి 27న పోలింగ్
- ఆసక్తికరంగా రాజకీయ పరిణామాలు



అశ్విని వైష్ణవ్



అమర్ పట్నాయక్



ప్రాశాంతొ నొందొ

భువనేశ్వర్: రాష్ట్రంలోని 3 రాజ్యసభ స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగనున్నట్లు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సోమవారం షెడ్యూల్ ప్రకటించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం పోలింగ్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది. ఓట్ల లెక్కింపు సాయంత్రం 5 గంటలకు నిర్వహించబడుతుంది. నామినేషన్ దస్తావేజులు దాఖలు చేయడానికి ఫిబ్రవరి 15 చివరి తేదీ కాగా, మర్నాడు ఫిబ్రవరి 16న దస్తావేజుల పరిశీలన పూర్తి చేస్తారు. పోటీ నుంచి అభ్యర్థిత్వ ఉపసంహరణకు చివరి తేదీ ఫిబ్రవరి 20 కాగా, ఫిబ్రవరి 29లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. దీనికి సంబంధించి అధికారిక నోటిఫికేషన్ ఫిబ్రవరి 8న విడుదల చేస్తారు.

● బీజేడీ-2, బీజేపీ-1 స్థానాల్లో...

భారతీయ జనతా పార్టీ ఎంపీ అశ్విని వైష్ణవ్, బిజూ జనతా దళ్ ఎంపీలు అమర్ పట్నాయక్, ప్రాశాంతొ నందొ రాజ్యసభ పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియనుంది. అలాగే మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన రాష్ట్రానికి చెందిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవీకాలం కూడా ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియనుంది. అయితే త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో లోక్‌సభ స్థానాల నుంచి బీజేపీ అధిష్టానం వారి ఎంపీలను బరిలోకి దింపేందుకు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

● అప్పట్లో ఆకస్మిక మద్దతు

2019లో రాజ్యసభ ఉప ఎన్నికలకు బీజేపీ తమ అభ్యర్థిగా ప్రతిపాదించిన మాజీ బ్యూరోక్రాట్ అశ్విని వైష్ణవ్‌కు బీజేడీ మద్దతు ఇచ్చింది. అయితే ఈసారి రాష్ట్రంలో రాజకీయ వాతావరణం విభిన్నంగా ఉంది. అధికార, విపక్షాల మధ్య లోపాయికారీ పొత్తుపై భారీగా విమర్శలు ఉన్నాయి. ఈ విమర్శల నుంచి రక్షణ పొందేందుకు వీలుగా ఉభయ అధికార బిజూ జనతా దళ్, ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీలు జాగ్రత్త పడే అవకాశం లేకపోలేదు. ఈ లెక్కన రాజ్యసభ స్థానాల ఎన్నికలో బీజేపీ అభ్యర్థికి బిజూ జనతా దళ్ అండగా నిలిచే అవకాశం లేదు.

● ఒడిశా రాజకీయాలకు కీలకం

ఒడిశాకు చెందిన ఇద్దరు కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్విని వైష్ణవ్‌ల రాజ్యసభ పదవీకాలం ఏప్రిల్‌తో ముగియనుంది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీరు ఇద్దరు సిద్ధమవుతున్నారు. బిజూ జనతా దళ్ నుంచి అమర్ పట్నాయక్, ప్రాశాంతొ నందొ కూడా ఈ ఏడాది ఏప్రిల్ 2024లో పదవీ విరమణ చేయనున్నారు. ఈ స్థానాల్లో బీజేడీ అభ్యర్థిత్వంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ నిర్ణయంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 27న రాజ్యసభ స్థానాల ఎన్నికలు జరుగుతున్నాయి. రాజ్యసభకు పార్టీ అభ్యర్థులను ఎంపిక చేయడంలో అధికార పక్షం బిజూ జనతా దళ్ ఆచితూచి అడుగు వేయాల్సి ఉంది. గత ఎన్నికల తరహాలో విపక్షం అభ్యర్థికి పట్టం గడితే, సార్వత్రిక ఎన్నికల్లో ఓటరుని మరోవిధంగా స్పందింపజేసి ప్రతికూల పరిస్థితులను ప్రేరేపించినట్లు అవుతుందనే ఊహాగానాలు వ్యాపించాయి. కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్లుగా బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ సన్నిహిత సంబంధాల గురించి చర్చలను తిప్పికొట్టడానికి ఈసారి బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వడంపై బీజేడీ ఇష్టపడకపోవచ్చు.

● సమయోచిత నిర్ణయం

సంక్లిష్ట రాజకీయ పరిస్థితులను అవలీలగా అధిగమించడంలో బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అత్యంత చతురుడు. తాజాగా మహిళా ఓటర్లని ఆకట్టుకునేందుకు దృష్టి సారిస్తున్నారు. దీనిలో భాగంగా రాజ్యసభకు మహిళ అభ్యర్థిని ఎంపిక చేయడం తథ్యమని తెలుస్తోంది. అలాగే సామాజిక సంక్షేమం దృక్పథం బలపరిచే దిశలో ఇతర వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగ అభ్యర్థులకు బీజేడీ ప్రాధాన్యత కల్పించే అవకాశం ఉంది. ఈసారి కోస్తా ప్రాంతం నుంచి సీనియర్ లోక్‌సభ ఎంపీని రాజ్యసభకు పంపించి, లోక్‌సభ స్థానంలో మరో కొత్త ముఖానికి అవకాశం కల్పించడం ఉభయతారక మంత్రం ప్రయోగించినా అతిశయోక్తి కాదు. ఇలా బిజూ జనతా దళ్ రాష్ట్రంలోని కోస్తా, పశ్చిమ, దక్షిణ, ఉత్తర ప్రాంతాల నుంచి సమతుల్య ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని పరిరక్షించే దృక్పథంతో రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించవచ్చు.

జంట నగరాల కమిషనర్‌గా సంజీబ్ పండా

భువనేశ్వర్: భువనేశ్వర్, కటక్ జంట నగరాల పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సంజీబ్ పండా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక కమిషనరేట్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విధుల్లో చేరారు. ఒడిశా కేడర్‌కు చెందిన 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సంజీబ్ పండా రాష్ట్ర పోలీసు విభాగంలో వివిధ హోదాల్లో పని చేశారు. పూరీ, రూర్కెలాలో పోలీసు సూపరింటెండెంట్‌గా, నైరుతి పరిధిలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ), ఇన్‌స్పెక్టర్ జనరల్ (సిబ్బంది), ఓఎస్ఏపీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేశారు. క్రైమ్ బ్రాంచ్ ఏడీజీగా, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా, ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా సైతం విధులు నిర్వహించారు. విధులు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు ప్రజలు సహకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కమిషనరేట్ పోలీసుల ముందున్న తక్షణ సవాళ్లలో రాబోయే ఎన్నికలు ముఖ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 5టీ, మో సార్కార్ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయడానికి కృషి చేస్తామని తెలియజేశారు. శాంతి భద్రతలు, సైబర్ నేరాలతో పాటు సమాజంలోని బలహీన వర్గాలు, మహిళలు, పిల్లలను రక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని వెల్లడించారు.



రాయగడ: బాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్ కౌర్

గుణుపూర్ సబ్ కలెక్టర్‌గా కౌర్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ కొత్త సబ్ కలెక్టర్‌గా కిరణ్ దీప్ కౌర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2021వ బ్యాచ్‌కు చెందిన కౌర్ బాలేశ్వర్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఇదివరకు గుణుపూర్ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన లలిత్ కుమార్ కుహరొ భువనేశ్వర్‌లోని స్కిల్ డవలప్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. గుణుపూర్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా కౌర్ అన్నారు. ఆమెకు సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు స్వాగతం పలికారు.

గ్రీవెన్స్‌కు విశేష స్పందన



పర్లాకిమిడి: వినతులను స్వీకరిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా బ్లాక్‌లోని అజయగడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రదాన్, ఎస్పీ స్వాతి ఎస్. కుమార్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో 39 వినతులు అందగా, వాటిలో వ్యక్తిగతం 10, గ్రామ సమస్యలకు సంబంధించినవి 29 ఉన్నాయి. వీటిలో ఒకరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గుమ్మా పంచాయతీ అధ్యక్షురాలు సునేమీ మండల్, బీడీవో శరత్ కుమార్ పాత్రో, తహసీల్దార్ జయద్రత్ అచార్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

● ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



సమావేశానికి హాజరైన ప్రజలు

భువనేశ్వర్: భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు రానున్న సార్వత్రిక ఎన్నికలే చివరి అవకాశమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. స్థానిక దిగువ పీఎంజీ కూడలిలో సోమవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. అలాగే ఒడిశాలో ఎన్నికల ప్రచారాన్ని 'ఒడిశా బచావో సమావేశ్' పేరుతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందని తెలియజేశారు. బిజూ పట్నాయక్, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ మధ్య మంచి సంబంధాలు ఉండేవన్నారు. కాంగ్రెస్ హయాంలో ఒడిశాలో పారాదీప్ పోర్టు, రౌర్కెలా స్టీల్ ప్లాంట్, చిలికా నేవల్ అకాడమీ, మంచేశ్వర్‌లో రైల్ కోచ్ ఫ్యాక్టరీ, హెచ్ఏఎల్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్, నైజర్, ఎయిమ్స్‌లను రాష్ట్రానికి ఇచ్చిందని చెప్పారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ వైఖరిపై స్పందిస్తూ బీజేపీ బెదిరింపులకు భయపడి కూటమిని వదిలివేస్తున్నారన్నారు. ఇలాంటి పిరికివాళ్ల సమక్షంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకుంటారని విచారం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో దాదాపు 90 మంది పార్టీ నేతలతో సమావేశమయ్యారు.

విశ్వకర్మ పథకానికి అనూహ్య స్పందన



పేర్ల నమోదు చేసుకుంటున్న చేతివృత్తి కార్మికులు



డీఐసీ కార్యాలయం వద్ద బారులుతీరిన మహిళలు

రాయగడ: చేతివృత్తి కార్మికులను ఆదుకునేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విశ్వకర్మ పథకానికి అనూహ్య స్పందన లభిస్తోంది. స్థానిక జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద 18 రకాల చేతివృత్తుల వారికి అందించే రూ.లక్ష రుణ సదుపాయం పొందేందుకు పలు కుటుంబాలు సోమవారం తరలివచ్చాయి. తమ పేర్లను నమోదు చేసుకునేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో బారులుతీరారు. జిల్లాలో కుమ్మరి, వెదురు ఉత్పత్తులు, పండ్లు, పూలతోటల నిర్వహణ, చాకలి తదితర చేతివృత్తులను నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న వీరంతా ప్రభుత్వం అందించనున్న రుణ సాయం కోసం పేర్లు నమోదు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా రుణ సదుపాయం పొందాలంటే అందుకు సంబంధించిన ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్ తదితర పత్రాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి విశ్వకర్మ ప్రాజెక్టు అధికారి ఎల్ఎస్ దురువ మాట్లాడుతూ.. సమితుల వారీగా లబ్ధిదారుల పేర్లు నమోదు చేస్తున్నామన్నారు. అర్హులైన వారికి రుణ సౌకర్యం అందుతుందని తెలియజేశారు.

కళల పరిరక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న సుస్మిత మెలక తదితరులు



అలరిస్తున్న కళాకారుల నృత్యాలు

జయపురం: జిల్లాలో కళలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సుస్మిత మెలక అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న పుష్‌పుని వేడుకల్లో ఆదివారం ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళలు, సంస్కృతి ప్రచారానికి పుష్‌పుని ఉత్సవాల నిర్వహణ ఒక మార్గమన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి టొలిన ప్రధాని, విశ్రాంత హెచ్ఎం బినోదిని శాంతపాత్రో, పుష్‌పుని నిర్వాహక కమిటీ సభ్యుడు హిమాంశు మహాపాత్రో, జిల్లా పరిషత్ సభ్యులు లతా దేవి, తొపతి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ఆదివాసీ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

● అమ్మో పులి..!



ఖుర్దా జిల్లా చందకా అభయారణ్యం పరిసరాల్లో చిరుత పులి సంచారం స్థానికుల దృష్టిలో పడింది. ఆదివారం రాత్రి పూట చందకా అభయారణ్యం ప్రహరి గోడపై ఈ చిరుత పులి విహారం పరిసర గ్రామస్తులను భయాందోళనకు గురి చేసింది. ఉత్కళ ఆస్పత్రి ఎదురుగా చందకా అభయారణ్యం ప్రహరీ గోడపై తిరుగాడుతున్నట్లు గ్రామస్తులు గుర్తించారు.

- భువనేశ్వర్

ముగిసిన సాగర సంబరాలు



వేదికపై మంత్రి విక్రమ్ కేసరి తదితరులు



ఆకట్టుకుంటున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



కళాకారుల శ్రీజగన్నాథ సాంస్కృతిక నాటిక ప్రదర్శన

గంజాం జిల్లా గోపాల్‌పూర్ తీరంలో ఉత్సాహంగా జరిగిన సాగర సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు అతిథులుగా ఎంపీ చంద్రశేఖర్ సాహు, రాష్ట్ర మంత్రి విక్రమ్ కేసరి అరుక్, దక్షిణాంచల్ ఐజీ సత్యబ్రత బొయి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాదేవి, సబ్ కలెక్టర్ వేణుగోపాల్, కమిషనర్ సోనాలి జెన్నా, బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవాల చైర్మన్, ఎమ్మెల్యే విక్రమ్ పండా మాట్లాడుతూ గోపాల్‌పూర్ తీరం అంతర్జాతీయ పర్యాటక స్థలంగా గుర్తింపు పొందిందన్నారు. ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం జరిగిన సాంస్కృతిక నృత్యాలు, స్టార్ నైట్ షోలు ఆకట్టుకున్నాయి.

- బరంపురం



కనువిందు చేస్తున్న కొరాపుట్ ఆదివాసీ నృత్య ప్రదర్శన



చిన్నారుల ఆధునిక నృత్య ప్రదర్శన



క్లుప్తంగా

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పొందూరు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారని జీఆర్‌పీ హెచ్‌సీ చక్రధరరావు తెలిపారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి పడిపోయి ఉంటాడని భావిస్తున్నామని పేర్కొన్నారు. మృతుడు ఎరుపు రంగు షర్ట్, నలుపు రంగు నైట్ ఫాంట్ వేసుకున్నాడని చెప్పారు. మృతుని గొంతు వద్ద పుట్టుమచ్చ, పొట్టపైన పెద్ద పుట్టు మచ్చ ఉన్నాయని చెప్పారు. మృతుడిని గుర్తుపట్టిన వారు 9491106219 నంబర్‌కు ఫోన్‌చేయాలని కోరారు.

ఆటో నుంచి జారి పడి వ్యక్తి దుర్మరణం

మెళియాపుట్టి: ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కరజాడ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. కరజాడ గ్రామానికి చెందిన బమ్మిడి అన్నయ్య(54) కొంతమంది గ్రామస్తులతో కలసి నందిగాం మండలం హరిదాసుపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి పరామర్శకు బయల్దేరాడు. ఆటో వెనుక కూర్చోవడంతో కరజాడ గ్రామం నుంచి బయల్దేరి కొద్దిదూరం వెళ్లేసరికి జారిపడిపోయారు. దీంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే కరజాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బైక్ నుంచి జారిపడి మహిళ..

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడాం పాతజాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. సంతబొమ్మాళి మండలానికి చెందిన జి.నీలమ్మ (48) అనే మహిళ చినబడాంలో ఉన్న క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్ వద్దకు ప్రార్థనల కోసం వచ్చారు. ప్రార్థనలు అయిపోయాక ఓ పాస్టర్ బైక్‌పై తిరిగి వెళ్తుండగా దారిలో బండి నుంచి ఆమె జారి పడిపోయారు. వెంటనే ఆమెను 108 వాహనంలో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యం పొందుతూ ఆమె మృతి చెందారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగావళిలో పడి వృద్ధుడు..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో ఓ వృద్ధుడు నాగావళిలో దిగి మూర్ఛ రావడంతో అక్కడే ప్రాణాలు వదిలేశారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు చెప్పిన వివరాల మేరకు.. నగరంలోని జబ్బావీధికి చెందిన జమ్మా ఎర్రయ్య (56) రామలక్ష్మణ దరిలో ఓ మిఠాయి దుకాణంలో కూలీ పనిగా పని చేస్తున్నారు. ఈయనకు భార్య చిన్నమ్మ, వివాహమైన కుమార్తె, ఐటీఐ చదువుతున్న కుమారుడు ఉన్నారు. ఎర్రయ్యకు మూర్ఛ వ్యాధి ఉంది. విశాఖ మానసిక చికిత్సాలయంలో కొన్నేళ్లు చికిత్స కూడా చేసుకున్నారు. ఇంటికొచ్చి ఆరు నెలలుగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం బహిర్భూమికని వెళ్లిన ఎర్రయ్య నదిలో దిగే సమయానికి మూర్ఛ రావడంతో మునిగిపోయాడు. స్థానికులు చూసి ఆయన భార్యతో పాటు 108కు సమాచారం అందజేశారు. 108 సిబ్బంది వచ్చి ఎర్రయ్య మృతి చెందినట్లు చెప్పడంతో భార్య కన్నీరుమున్నీరయ్యారు. రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మణరావు ఘటనాస్థలిలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వీసీతో పూర్వ పాలకమండలి సభ్యుల భేటీ

శ్రీకాకుళం కల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ కేఆర్ రజనీని ఏయూ పూర్వ పాలక మండలి సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను కలసిన వారిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలక మండలి పూర్వపు సభ్యులు డాక్టర్ జామి భీమశంకరరావు, లయన్ బరాటం లక్ష్మణరావు, కాకినాడ ఆదిత్య కళాశాలల డైరెక్టర్ బరాటం చక్రవర్తి ఉన్నారు.

'జీడిపంటకు గిట్టుబాటు ధర ప్రకటించాలి'

కాశీబుగ్గ: ఉద్దానంలో పండుతున్న జీడిపంటకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం ప్రకటించాలని వామపక్ష నాయకులు సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ పార్టీ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. పలాసలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. జీడి పప్పు ధర రోజురోజుకు ఆకాశాన్ని అంటుతుంటే జీడి పిక్క ధర పాతాళానికి పడిపోతోందని అన్నారు. జీడి పిక్కల 80 కిలోల బస్తాలు ఆర్బీకేలతో కొనుగోలు చేయించాలని, స్థానిక జీడిపిక్కలు పూర్తిగా కొనుగోలు చేసిన అనంతరం విదేశీ పిక్కలు దిగుమతికి అనుమతించాలని కోరారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



మంత్రి మండలి తీర్మానాలు వివరిస్తున్న చీఫ్ సెక్రటరీ జెనా

- 5 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం
- గిరిజన భాషల పరిరక్షణ కమిషన్ ఏర్పాటు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా వెల్లడి

భువనేశ్వర్: ఒడిశాలోని సుమారు కోటి మంది గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా తెలియజేశారు. ఈ మేరకు 5 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమెదం తెలిపినట్లు స్థానిక లోక్‌సేవా భవన్‌లోని కన్వెన్షన్ సెంటర్ మొదటి అంతస్తు సమావేశ మందిరంలో సోమవారం వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా గిరిజనుల అభివృద్ధి కోసం కొత్త పథకం లఘు వన జాత్య ద్రవ్య కార్యక్రమం తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

లాభ యోజన

లాభ యోజన అనేది లఘు వన జాత్య ద్రవ్య పథకం (ఎంఎఫ్‌పీ). దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చుతుంది. ఈ పథకం కింద లఘు అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) లభిస్తుంది. కనీస మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం నిర్ణయిస్తుంది. ఈ పథకం కింద ఒక ప్రాథమిక సంగ్రహణకర్త (గిరిజన) టీడీసీసీవోఎల్ ద్వారా సేకరణ కేంద్రాల వద్ద సేకరించిన కనీస మద్దతు ధరకు లఘు అటవీ ఉత్పత్తులను విక్రయించగలరు. ప్రాథమిక సంగ్రహణకర్తల్లో 99 శాతం మంది గిరిజనులు, వారిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నందున లాభ యోజన మిషన్ శక్తి మహిళ స్వయం సహాయక బృందాలతో ఏకీకృతం చేస్తారు. ఈ సేకరణ కేంద్రాలు మహిళా ఎస్‌హెచ్‌జీ వర్గాలు నిర్వహిస్తాయి. టీడీసీసీవోఎల్ సాయంతో ఏదైనా ఇతర నోటిఫైడ్ ఏజెన్సీలకు ఈ అవకాశం కల్పించేందుకు మంత్రి మండలి వెసులుబాటు కల్పించింది. ద్రవ్యాలు సేకరించిన తర్వాత మొత్తం లబ్ధిదారు ఖాతాకు ప్రత్యక్ష లబ్ధి బదిలీ (డీబీటీ) మాధ్యమంలో సంబంధిత వ్యక్తి పొదుపు ఖాతాకు బదిలీ చేస్తారు. అలాగే ఎస్‌హెచ్‌జీ లేదా ఏదైనా ఇతర ఏజెన్సీలకు 2 శాతం కమీషన్ మంజూరు చేస్తారు. ప్రాక్యూర్‌మెంట్ ఆటోమేషన్ వ్యవస్థ ఎంఎఫ్‌పీ యొక్క సమగ్ర సేకరణ, ప్రాథమిక సంగ్రహణకర్త మరియు సేకరణ పాయింట్ వివరాలను సంగ్రహిస్తుంది. 5 టీ సూత్రాల ప్రకారం ప్రాక్యూర్‌మెంట్ ఆటోమేషన్ వ్యవస్థ పారదర్శకతను నిర్ధారించడానికి సాంకేతికతను ఉపయోగిస్తుంది. ఇది గిరిజన ప్రజలకు అధిక ప్రయోజనాలను చేకూర్చుతుంది. తదుపరి విక్రయం కోసం టీడీసీసీవోఎల్ ఈ-టెండరింగ్ నిర్వహిస్తుంది. ఉత్పత్తుల విలువ జోడింపు మరియు అనుబంధ ఉత్పాదన యూనిట్లను అన్వేషిస్తుంది.

రాయగడలో చింతపండు ఉత్పత్తి కేంద్రం

గిరిజనులకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాయగడలో రూ.25 కోట్ల వ్యయ ప్రణాళికతో చింతపండు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఇది లాభ యోజన ద్వారా సేకరించిన చింతపండు లఘు వనజాతి ద్రవ్యాల ఉత్పత్తిని విలువ జోడింపు కోసం ఉపయోగిస్తుంది. లాభ యోజన ప్రవేశంతో లఘు వన్య ద్రవ్య పదార్థాల విక్రయం, ఉత్పత్తి రంగాల్లో దళారుల బెడద తొలగిపోతుంది.

గిరిజన భాషల సంరక్షణ

ఒడిశాలోని షెడ్యూల్డ్ తెగల గిరిజన భాషల సంరక్షణ, ప్రచారం కోసం కమిషన్ ఏర్పాటుకు నవీన్ పట్నాయక్ మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఒడిశాలో 21 గిరిజన భాషలు ఉన్నాయి. వీటి సంరక్షణ, ప్రోత్సాహం, అభివృద్ధి, వ్యాప్తి, ప్రసారం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కమిషన్ బహుభాషా విద్యను ప్రోత్సహిస్తుందన్నారు. గిరిజన భాషలను డాక్యుమెంట్ చేయడం, సంరక్షించడం, ఆ భాషల వినియోగాన్ని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. హో, ముండారి, కుయ్, సారా వంటి గిరిజన భాషలను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చే దిశగా కూడా కమిషన్ కృషి చేస్తుంది.

ఎస్టీ జాబితాలో 169 వర్గాలు

ఒడిశాలోని 169 వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ మంత్రి మండలి ఏకగ్రీవంగా తీర్మానించింది. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో హో, ముండారి, కోయ మరియు సవర భాషలను చేర్చడాన్ని పునరుద్ఘాటిస్తూ నవీన్ మంత్రి మండలి ఈరోజు ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు



రక్త దాతలకు హెల్మెట్లతో సత్కరిస్తున్న నిర్వాహకులు

జయపురం: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మొబలైజింగ్ టీమ్ సభ్యులు అన్నారు. స్థానిక బాబా సాహేబ్ కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా రక్తదానం చేసిన దాతలకు హెల్మెట్‌ను బహూకరించారు. శిబిరాన్ని మణిత టక్రి ప్రారంభించారు. అధ్యక్షురాలు మానశ్రీ టక్రి, డైరెక్టర్ జాకబ్ గంట, కన్వీనర్ పి.రాజ పాత్రో రబి టక్రిలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మానశ్రీ టక్రి మాట్లాడుతూ రక్తదాన శిబిరాల ద్వారా రక్తం సేకరించి, సమాజానికి సేవలందించటమే తమ టీమ్ ప్రధాన లక్ష్యమన్నారు. శిబిరానికి కొరాపుట్, నవరంగపూర్, కొరాపుట్, రాయగడ జిల్లాల నుంచి దాతలను ఆహ్వానించామని వెల్లడించారు. మొత్తం 1,000 యూనిట్లు సేకరించే లక్ష్యంగా శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

'నిత్యం అప్రమత్తంగా ఉండాలి'

శ్రీకాకుళం క్రైమ్ : రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో డిపో-1 గ్యారేజీ ఆవరణలో డ్రైవర్లకు, సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా డీటీసీ (రవాణా కమిషనర్) మంగాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని, డ్రైవర్లు తమ దృష్టంతా రహదారిపైనే కేంద్రీకరించాలని, ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో మద్యం సేవించరాదని, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. విద్యార్థులు బస్సుల్లో ఫుట్‌పాత్ ప్రయాణం చేయరాదని, రన్నింగ్ బస్సుల్లో ఎక్కడం గానీ, దిగడం కానీ చేయరాదన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, రెండు డిపోల మేనేజర్లు పీబీ మల్లికార్జునరాజు, ఎస్ఎస్ఆర్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, కార్యాలయ, సెక్యూరిటీ సిబ్బంది, అసోసియేషన్ల ప్రతినిధులు, కాకినాడ ఆదిత్య కళాశాల విద్యార్థులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



మండీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ తదితరులు

జయపురం: మండీల్లో అమ్మేందుకు రైతులు తెచ్చే ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర చెల్లించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సూచించారు. స్థానిక రెగ్యులేటింగ్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండీల్లో రైతులకు కనీస సౌకర్యాలు సమకూర్చాలని, ముఖ్యంగా ధాన్యం భద్రపరిచేందుకు తగిన గోదాములు ఏర్పాటు చేయాలని సూచించారు. జయపురం సబ్ డివిజన్‌లో రైతుల నుంచి రబీ, ఖరీఫ్‌లలో ధాన్యం కొనుగోలుకు జయపురం ప్రాంతీయ మార్కెటింగ్ కమిటీ నిర్వహిస్తున్న భూమిక కొనియాడదగ్గదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, కార్యదర్శి చంద్ర సెటియ, మార్కెట్ పరిచాలన కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ బాలారాయ్, డైరెక్టర్ దేవేంద్ర బాహిణీపతి తదితరులు పాల్గొన్నారు.

మీ ఇళ్లపై మీకే హక్కు

- జగనన్న కాలనీల్లో పేదల స్థలాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- జిల్లాలో 27,142 మందికి లబ్ధి
- గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిదారులకు మేలు

పార్వతీపురంటౌన్:

రాష్ట్రంలో పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు అందరికీ ఇళ్లు' పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఊరు, వార్డుల్లో లే అవుట్లు వేశారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. అంతటితో ఆగకుండా ఆ స్థలాలపై పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సోమవారం నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్ణయంతో జిల్లాలో ఇంటి స్థలం వచ్చిన వేలాదిమంది పేదలకు మేలు జరగనుంది. ఇంటిపై సర్వహక్కులు లభించనున్నాయి.



పార్వతీపురం కృష్ణపల్లిలో వైఎస్సార్ జగనన్న లేఅవుట్



పార్వతీపురం పట్టణం జగన్నాథపురం-2 సచివాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న సిబ్బంది

జిల్లాలో 27,142 మందికి స్థలాలు

అందరికీ ఇళ్లు పథకంలో ప్రభుత్వం పార్వతీపురం మన్యం జిల్లాలోని 27,142 మందికి స్థలాలు మంజూరు చేసింది. వాటిలో ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున సాయం అందించింది. డ్వాక్రా మహిళలకు మరో రూ.35 వేల రుణం మంజూరు చేసింది. రాయితీపై సిమెంట్, ఐరన్ పాటు ఇసుక ఉచితంగా అందిస్తోంది. జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి తాగు నీరు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ ఇతర వసతులు కల్పిస్తోంది. అన్ని కాలనీల్లో నిర్మించిన ఇంటి విలువ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉంటుంది.

ప్రారంభమైన రిజిస్ట్రేషన్‌లు

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఫిబ్రవరి 9లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే వీఆర్‌ఓలు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చింది. జిల్లాలోని 350 గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం తరఫున వీఆర్‌ఓ లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయనుండగా, కార్యదర్శులు జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లబ్ధిదారుని ప్లాట్ నంబర్, సరిహద్దుల వివరాలను రెవెన్యూ అధికారులు సిద్ధంచేశారు.

టీడీపీ హయాంలో డీపట్టాలు మాత్రమే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల లబ్ధిదారులకు డి-పట్టాలు మాత్రమే ఇచ్చేవి. గృహ నిర్మాణ రుణం కోసం ఆ పట్టాలను హౌసింగ్ కార్పొరేషన్ తనఖా పెట్టుకునేది. లబ్ధిదారులకు ఎలాంటి హక్కులూ ఉండేవి కావు. అప్పులు పుట్టక ఇబ్బందికర పరిస్థితులు ఉండేవి.

జగనన్న ప్రభుత్వంలో సర్వ హక్కులు

పేదల ఇళ్లపై సీఎం జగన్ సర్వహక్కులు కల్పిస్తున్నారు. పదేళ్ల తర్వాత ఇంటిపై అన్ని హక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి, కన్వేయన్స్ డీడ్ అందజేస్తున్నారు. దీనికోసం అసైన్డ్ భూముల చట్టాన్ని ప్రభుత్వం సవరించింది. పదేళ్ల తర్వాత ఇవి సేల్ డీడీలుగా మారతాయి. తద్వారా లబ్ధిదారులకు ఆ ఇంటిపై సర్వహక్కులు సంక్రమిస్తాయి. అలాగే, నివసిస్తున్న ఇంటి సమీపంలోని సచివాలయాల్లోనే రిజిస్ట్రేసన్ చేస్తున్నారు.

గడువులోగా పూర్తిచేస్తాం



జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ చేయడానికి ఏర్పాట్లు చేశాం. ఫిబ్రవరి 9లోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. ఈ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. స్థలం రిజిస్ట్రేషన్‌తో ఇళ్లపై లబ్ధిదారుడికి పూర్తి హక్కులు లభించడంతో పాటు లబ్ధిదారులకు ఎంతోమేలు చేకూరుతుంది.

– టి.రమేష్, హౌసింగ్ పీడీ, పార్వతీపురం మన్యం

పెళ్లిపీటలెక్కనున్న దీప్ గ్రేస్ ఎక్కా



దీప్ గ్రేస్ ఎక్కా

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన ఒడిశా హాకీ దిగ్గజం దీప్ గ్రేస్ ఎక్కా త్వరలో పెళ్లి కూతురు కానుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న అనూప్ లక్రాతో వివాహ బంధానికి సిద్ధమైంది. సుందర్‌గడ్ జిల్లా ఉల్కిఢి గ్రామానికి చెందిన దీప్ గ్రేస్ ఎక్కా నిశ్చితార్థం జనవరి 26న జరిగింది. వరుడు అనూప్ లక్రా సుందర్‌గడ్ జిల్లా సబ్‌డేగా మండలం దేవగావ్ గ్రామస్తుడు. దీప్ గ్రేస్ ఎక్కా ప్రస్తుతం ఈస్ట్ కోస్ట్ రైల్వే (ఈకోర్)లో పనిచేస్తుండగా, అనూప్ లక్రా ఇండియన్ ఆర్మీలో ఉన్నారు. అతను కొన్ని జాతీయ స్థాయి హాకీ మ్యాచ్‌లలో ఒడిశాకు ప్రాతినిధ్యం వహించాడని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అత్యంత ప్రశంసలు పొందిన క్రీడాకారిణి ఎక్కా 2011 నుంచి 2023 సంవత్సరాల మధ్య 268 మ్యాచ్‌లలో భారత మహిళల హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఆమె ఈ ఏడాది జనవరి 27న అంతర్జాతీయ ఆటల నుంచి రిటైర్మెంట్ ప్రకటించింది. సుందర్‌గఢ్ జిల్లాలో జన్మించిన దీప్ గ్రేస్ ఎక్కా చిన్నతనంలోనే రాష్ట్రస్థాయి హాకీ మ్యాచ్‌లు ఆడడం ప్రారంభించింది. 2011లో రాంచీలో జరిగిన జాతీయ క్రీడల్లో ఆడి, అదే ఏడాది జూనియర్ ఆసియా కప్ జట్టుకు ఎంపికైంది. 2022 సంవత్సరంలో అర్జున్ అవార్డు సత్కారం పొందింది.

పూణే టూర్‌కు గిరిజన యువత



ప్రయాణానికి వెళ్లనున్న యువతతో బీఎస్ఎఫ్ అధికారులు



యువతకు ఐడీ కార్డులు ఇస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా నుంచి 20 మంది గిరిజన యువతను బీఎస్ఎఫ్ తరుపున ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పూణే టూర్‌కు తీసుకెళ్లనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎంవీ 3 గ్రామం వద్దనున్న బీఎస్ఎఫ్ క్యాంపు వద్ద బీఎస్ఎఫ్ కమాండర్ వరేనేంద్ర ప్రతాప్ సింగ్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. దీనిలో భాగంగా చిత్రకొండ సమితి పనాస్‌పూట్, బేజాంగి, టికార్‌పోడ, తోంటాపల్లి, పూజారిగూడ గ్రామాలకు చెందిన 18 మంది అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఎంపికయ్యారు. టూర్‌కు వీరితో పాటు ముగ్గురు బీఎస్ఎఫ్ సిబ్బంది కూడా వెళ్తారు. వీరికి మహారాష్ట్రలోని పర్యాటక ప్రదేశాలు, క్రీడాకారులను చూపిస్తారు. కార్యక్రమంలో కమాండర్ శివ ఓం, 2వ బెటాలియన్ డిప్యూటీ కమాండర్ శుభరంజాన్ మహాపాత్రో, మల్కన్‌గిరి డీపీఆర్వో ప్రమిళ మాఝి, మల్కన్‌గిరి లేబర్ అధికారి పూర్ణిమ దురుకా తదితరులు పాల్గొన్నారు.

14 ఏళ్ల చీకట్లు తొలగాయి



నువాసాయి గ్రామంలో విద్యుత్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి

కంచిలి: ఆ గిరిజన గ్రామం ఏర్పాటై 14 ఏళ్లు గడుస్తోంది. ఇన్నాళ్లుగా ఎంతమందిని అడిగినా ఆ ఊరికి విద్యుత్‌సదుపాయం ఏర్పాటు చేయలేకపోయారు. గడపగడపకూ మన ప్రభుత్వం పుణ్యమా అని ఆ ఊరు ఇప్పుడు విద్యుత్ వెలుగులు చూస్తోంది. కంచిలి మండలంలోని నువాగడ గిరిజన పంచాయతీ పరిధి నువాసాయి గ్రామంలో పరిస్థితి ఇది. ఈ గ్రామంలో ఇటీవల గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు కరెంటు గురించి ప్రస్తావించడంతో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ దృష్టిలో పెట్టారు. దీంతో ఆమె ఆదేశాల మేరకు స్థానిక ఎలక్ట్రికల్ అధికారుల ప్రోత్సాహంతో ఆ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. సోమవారం ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి స్విచ్ ఆన్ చేసి విద్యుత్ సదుపాయాన్ని ప్రారంభించారు. అలాగే మండలంలోని బొగా బెణి గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో నువాగడ సర్పంచ్ సబితా గొమాంగో, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, పార్టీ నేతలు లడ్డుకేశవ పాత్రో, ప్రకాష్ చంద్ర పండా, కొయిరా గౌడో, రమేష్ గౌడో, ఉజ్వల గౌడో, రుషి భుయా పాల్గొన్నారు.

బాలబాలికలకు ఉచిత న్యాయ సేవలు



జైల్లో రిమాండ్ ఖైదీల నుంచి వివరాలు సేకరిస్తున్న సన్యాసినాయుడు

నరసన్నపేట: జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న, లేదా రిమాండ్ ఖైదీలుగా ఉన్న బాలబాలికలకు ఉచితంగా న్యాయ సేవలు అందించనున్నామని జిల్లా న్యాయసేవాదికార సంస్థ కార్యదర్శి, సబ్‌జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక సబ్ జైల్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో పాటు శిక్ష అనుభవిస్తున్న వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. భోజన వసతి, ఆరోగ్య సేవలు అందుతున్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అలాగే 22 ఏళ్లలోపు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. అలాంటి వారు ఉంటే వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. వారు కోరుకుంటే న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట న్యాయవాదులు ఇంద్ర ప్రసాద్, మధుసూదనరావు, జి.వెంకటరమణ, ఎస్.రమేష్‌కుమార్, రోణంకి కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 27న ప్రారంభమైన జేఈఈ ఆన్‌లైన్ పరీక్షలు కొనసాగుతున్నాయి. పరీక్షలు ఫిబ్రవరి ఒకటి వరకు కొనసాగనున్నాయి. ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్ కేంద్రానికి మొదటి షిఫ్ట్‌లో 100 కి 99, రెండో షిఫ్ట్‌లో 100 కి 100 మంది హాజరయ్యారు. చిలకపాలెం శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 100 కి 100, రెండో షిఫ్ట్‌లో 100 కి 100 మంది హాజరయ్యారు. రెండు రోజుల్లో 800 మందికి 792 మంది హాజరయ్యారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు విజయనగరంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 31న నిర్వహిస్తున్న ప్రాంతీయ జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 87 బహుళ జాతి కంపెనీలలో (ఐటీ, ఫార్మా, హెల్త్, బ్యాంకింగ్, రిటైల్, ఆటోమోటివ్, టూరిజం తదితర సంస్థల్లో) 5,842 ఖాళీలను భర్తీ చేస్తారని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, బిటెక్, డిప్లమో, డిగ్రీ, ఎంబీఏ చదివిన యువత అర్హులన్నారు. ఉదయం 9గంటలనుంచి జాబ్‌మేళా జరుగుతుందని, మరిన్ని వివరాలకు ఫొన్ 6301275511 నంబరును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, ఆర్‌డీఓ కె.హేమలత, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ.కరుణాకర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామస్వామిని దర్శించుకున్న జొన్నవిత్తుల



రామస్వామిని దర్శించుకుంటున్న గేయరచయిత జొన్నవిత్తుల దంపతులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామిని ప్రముఖ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు సోమవారం సందర్శించారు. సతీ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం సిబ్బంది శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు. అనంతరం సీతారామస్వామి సన్నిధిలో స్వామిని దర్శించి పూజలు చేశారు. అర్చకులు జొన్నవిత్తుల దంపతులకు వేద ఆశీర్వచనం అందజేసి రామక్షేత్ర మహత్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా జొన్నవిత్తుల స్వామి సన్నిధిలో పలు భక్తి గీతాలను ఆలపించి అలరించారు. కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్-24 విజేత విజయనగరం



ట్రోఫీతో విజయనగరం జట్టు సభ్యులు

విజయనగరం ఫోర్ట్: ల్యాబ్‌టెక్నీషియన్ ప్రీమియర్ లీగ్ -24 విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. ఈనెల 27వతేదీన విశాఖపట్నంలో ల్యాబ్ టెక్నీషియన్ ప్రీమియం లీగ్ -24 క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టుపై విజయనగరం జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. విజయనగరం టీమ్‌కు సీహెచ్ సంతోష్ కెప్టెన్‌గా వ్యవహరించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు జొన్నవలస విద్యార్థులు



యుగంధర్



తులసి

విజయనగరం రూరల్: ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4 వరకు ఝార్ఖండ్ రాజధాని రాంచిలో నిర్వహించే అండర్-14 జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు విజయనగరం మండలంలోని జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని హెచ్‌ఎం జి.విజయలక్ష్మి సోమవారం తెలిపారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న డి.యుగధర్, ఎ.తులసి ఈ నెల 22 నుంచి 28 వరకు చిత్తూరు జిల్లాలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో రాష్ట్ర జట్టు తరఫున వారు పాల్గొన్నారని తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులను, పీడీ పి.రామకృష్ణను జెడ్పీటీసీ కెల్ల శ్రీనివాసరావు, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రైలుపట్టాలపై యువకుడి మృతదేహం



మృతుడు రమేష్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: అనుమానాస్పద రీతిలో రైలు పట్టాలపై ఓ యువకుడి మృతదేహం పడి ఉంది. దీనికి సంబంధించి జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, వన్‌టౌన్ పోలీసులు సోమవారం తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి.

ఒడిశా రాష్ట్రంలోని రాయగడ రాయట్ కాలనీకి చెందిన ఇజ్జిరోతు రమేష్ (26) లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం విజయనగరం వచ్చి ఆనాటి నుంచి అలకానందకాలనీలో తల్లి లక్ష్మితో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసైన రమేష్ ఆదివారం రాత్రి తల్లి దగ్గర డబ్బులు తీసుకుని వెళ్లి, రాత్రి ఇంటికి వచ్చి భోజనం చేశాడు. ఆ తర్వాత నుంచి మరి కనపడలేదని తల్లి చెబుతోంది. ఉదయం అటుగా ట్రాక్ దాటుకుని వెళ్లే ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించి సమాచారమందించడంతో హుటాహుటిన కుమార్తె పార్వతితో కలిసి తల్లి లక్ష్మి పట్టాల వద్దకు వచ్చి మృతదేహాన్ని చూసి తన కొడుకేనని గుర్తించి లబోదిబోమంది. రైలు పట్టాలకు కొద్దిదూరంలో రాళ్లపై రక్తం తుళ్లిపడి ఉంది. అక్కడి నుంచి పావు కిలోమీటరు దూరంలో తల, మొండెం వేర్వేరుగా పడి ఉన్నాయి. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు, క్లూస్ టీమ్ మృతుని శరీరంపై ఉన్న గాయాలను, పలు కీలక ఆధారాలను సేకరించారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆర్‌పీఎఫ్ ఎస్సై శ్రీధర్, జీఆర్‌పీ ఎస్సై రవివర్మలు మృతదేహాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతి కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

కరుణించు మేరిమాత..!

- నేడు మరియగిరి యాత్రకు ఏర్పాట్లు పూర్తి
- 70 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు
- ఉత్తరాంధ్రా జిల్లాల నుంచి 50 వేల మంది హాజరు కానున్నట్లు అంచనా



భక్తులతో పూజలందుకుంటున్న మరియమాత



మరియగిరి ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీ

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం సమీపంలో యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన శ్రీకాకుళం మేత్రాసన పాలక పునీతురాలు, క్రైస్తవుల సహాయమాత మేరిమాత యాత్ర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించేం దుకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఏటా జనవరి 30న మరియగిరి యాత్ర ఆనవాయితీగా జరుగుతుంది. కుల, మతాలకు అతీతంగా భక్తులు వచ్చి పూజలు చేస్తుంటారు. కొబ్బరికాయలు కొట్టి, తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున గతంలో కంటే వైభవంగా మహోత్సవాన్ని జరిపేందుకు మరియగిరి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. భక్తులు మేరిమాతను దర్శించుకునేందుకు కొండపైన క్యూలు ఏర్పాటు చేశారు. కొండ దిగువన శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయిరాల విజయకుమార్ ఆధ్వర్యంలో జరగనున్న దివ్యపూజకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ఇటీవల కొత్తగా ప్రార్థనా మందిరాన్ని నిర్మించారు. యాత్ర ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

31 ఏళ్లుగా శ్రీకాకుళం మేత్రాసనం ఆధ్వర్యంలో..

పూర్వకాలం నుంచి మరియగిరి యాత్ర ఇక్కడ జరిగేది. అయితే గడిచిన 31 ఏళ్ల నుంచి శ్రీకాకుళం మేత్రాసనం ఆధ్వర్యంలో మరియగిరి యాత్ర జరుగుతోంది. ఈ ఏడాది మరియగిరి యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలోని పలు చర్చిల నుంచి ఫాదర్‌లు, మఠకన్యలు హాజరై ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

పోలీస్ బందోబస్తు ..

మరియగిరి యాత్రకు పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో 70 మంది పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నట్లు సీఐ చంద్రమౌళి తెలిపారు. వీరఘట్టం ఎస్సై ఎం.గోవింద సోమవారం మరియగిరి ప్రాంగణాన్ని పరిశీలించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు బృందాలను నియమించారు. వాహనదారులు, ఆటోవాలాలు నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలను నిలుపుదల చేయాలని కోరారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు..

మరియగిరి యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులు తరలి రానున్నారు. వారి కోసం పార్వతీపురం, పాలకొండ, శ్రీకాకుళం ఆర్టీసీ డిపోల నుంచి ప్రతి 10 నిమిషాలకు మరియగిరి స్పెషల్ బస్సులు నడపనున్నట్లు ఆయా డిపోల మేనేజర్లు తెలిపారు. సుమారు 50 వేలమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో మరియగిరి వద్ద ప్రత్యేక ఆర్టీసీ కంట్రోల్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

పీఆర్ జేఈ ఆత్మహత్య

- ఈఈ, డీఈల వేధింపులే కారణమని మృతుని భార్య ఆరోపణ



ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన రామకృష్ణ

రామకృష్ణ (ఫైల్)

రాజాం సిటీ: రాజాం పంచాయతీరాజ్ కార్యాలయంలో రేగిడి మండలం పీఆర్ జేఈగా విధులు నిర్వహిస్తున్న వల్లూరు రామకృష్ణ (48) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం పెద్ద కుమార్తె మౌనికను కళాశాలకు తీసుకువెళ్లి అక్కడి నుంచి 9గంటల సమయంలో కార్యాలయానికి చేరుకుని మొదటి అంతస్తులోని గదిలో ముందుగా పురుగు మందు తాగిన ఆయన వాంతులు చేసుకున్నాడు. వెంటనే అక్కడే ఉన్న చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. పైన ఏదో శబ్దం వస్తున్న విషయాన్ని గమనించిన తోటి ఉద్యోగులు పైకి వెళ్లి చేసి ఫ్యాన్‌కు వేలాడుతున్న రామకృష్ణ మృతదేహాన్ని చూసి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఉదయం 9.30గంటల సమయంలో రామకృష్ణ మృతి వార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈఈ, డీఈలు ఇక్కడికి రావాలని, తన భర్త మృతికి వారే కారణమని మృతుని భార్య ఉమాదేవితోపాటు బంధువులు డిమాండ్ చేశారు. మృతుని భార్య ఉమాదేవి అధికారుల వేధింపులే తన భర్త ఆత్మహత్యకు కారణమని, అధికారులతో పాటు కొంతమంది నాయకులు కూడా భర్త చావుకి కారణమయ్యారని వారందరిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరింది.

డీఈపై మృతుని బంధువుల దాడి

కార్యాలయం ఆవరణలోనే మృతుని కుటుంబ సభ్యులు బంధువులు ఉండగా అక్కడికి చేరుకున్న డీఈ జయప్రకాశ్‌పై దాడి చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బాధితులను నిలువరించి డీఈని టౌన్ సర్కిల్ కార్యాలయానికి పోలీసులు తరలించి అనంతరం మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు.



డీఈపై దాడిచేస్తున్న మృతుని బంధువులు

లారీ, బైక్ ఢీ: యువకుడి మృతి

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో గల సంతోషి మాత గుడి ఎదురుగా సోమవారం బైక్‌ను లారీ ఢీకొడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం దొగ్గవానిపాలెం గ్రామానికి చెందిన దమ్ము అప్పలరాజు(35) ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఎస్.కోట బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా అరకు -విశాఖ రోడ్డులో సంతోషిమాత గుడి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడితీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పార్వతి, హాసిని (12), హసిత్ బాబు పిల్లలున్నారు. ఈ సంఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.




మృతిచెందిన యువకుడు అప్పలరాజు (ఫైల్)

నదిలో పడి వ్యక్తి..

మక్కువ: మండలంలోని శంబర గ్రామం సమీపంలో గోముఖి నదిలో ప్రమాదవశాత్తు పడి సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై పి. నరసింహమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలంలోని ఎస్.పెద్దవలస గ్రామానికి చెందిన వడ్డి సింహాచలం(45) గోముఖి నదిలో స్నానానికి దిగుతుండగా జారిపడ్డాడు. నదిలో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులు సమాచారం అందించడంతో, సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతుడిని ఎస్.పెద్దవలస గ్రామానికి చెందిన సింహాచలంగా గుర్తించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు

- ఆరు తులాలు బంగారు అభరణాలు రికవరీ



వృద్ధురాలి హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

భోగాపురం: మండలంలోని మహారాజుపేట గ్రామానికి చెందిన ముద్దాడ అప్పయ్యమ్మ(76)ను హత్యచేసి పరారైన నిందితుడు ఇజ్జిరపు కూర్మారావు(21)ను అరెస్టు చేసి ఆరుతులాల బంగారు అభరణాల (మూడు గాజులు, రెండు పేట్ల తాడు)ను రికవరీ చేశామని సీఐ బీవీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన భోగాపురం సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈనెల 25వ తేదీన అప్పయ్యమ్మ తన ఇంట్లో బాత్‌రూమ్‌లోపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దీనిపై మృతురాలి కుమార్తె నల్ల గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై సూర్యకుమారి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో విజయనగరం మండలం గుంకలాం గ్రామానికి చెందిన కూర్మారావు మహారాజుపేట గ్రామానికి సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో మృతురాలు అప్పయ్యమ్మ ఇంట్లో అద్దెకు ఉంటూ రోజు కళాశాలకు వెళ్లి వస్తున్నాడు. అయితే కూర్మారావు చెడు వ్యాసనాలకు బానిసై స్నేహితులతో కలిసి ఇంట్లో పార్టీలు చేసుకుని మద్యం తాగుతూ ఉండేవాడే. దీంతో అప్పయ్యమ్మ కూర్మారావుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈనెల 25న ఇద్దరి మధ్య ఇలాగే గొడవ జరగడంతో కూర్మారావు కోపోద్రేకంతో అప్పయ్యమ్మను హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న ఆరు తులాల బంగారు అభరణాలను తీసేసి, ఆమెను బాత్‌రూమ్ వద్దకు తీసుకువెళ్లి కాలుజారి పడిపోయినట్లు చిత్రీకరించి పరారయ్యాడు. దీంతో అనుమానం వచ్చి ఈనెల 28న గుంకలాం గ్రామంలో విద్యార్థి కూర్మారావును అదుపులోకి తీసుకుని విచారణ చేయగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడి వద్ద బంగారు అభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ వెంకటేశ్వర రావు వివరించారు.

బైక్ దొంగల అరెస్ట్ : 12 మోటార్ సైకిల్స్ రికవరీ



స్వాధీనం చేసుకున్న మోటార్‌సైకిల్స్‌ను చూపిస్తున్న డీఎస్పీ, ఎస్సై

విజయనగరం క్రైమ్: జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడిన ఓ నిందితుడిని, ఇద్దరు జువైనల్స్‌ను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన దుప్పాడ దుర్గాప్రసాద్, మరో ఇద్దరు జువైనల్స్‌ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి, 12 మోటార్ సైకిల్స్ రికవరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అనుమానాస్పదంగా ఒక జువైనల్ సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అవసరాల కోసం బైక్ దొంగతనాలకు పాల్పడి, ఖర్చుల నిమిత్తం అమ్మేసేవాడినని తెలిపాడు. ఈ క్రమంలో 12 మోటార్ సైకిల్స్ దొంగిలించి, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని తిరుపతయ్యపాలెం గ్రామానికి చెందిన దుప్పాడ దుర్గాప్రసాద్, మరో జువైనల్‌కు అప్పగించానని తెలిపాడు. ఈ సమాచారం మేరకు పోలీసులు రణస్థలానికి చెందిన దుర్గాప్రసాద్‌ను, మరో జువైనల్‌ను అరెస్టు చేసి, వారి దగ్గర ఉన్న 12 మోటార్ సైకిల్స్ రికవరీ చేశారు.

ఎస్‌ఐలకు స్థాన చలనం

విజయనగరం క్రైమ్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్‌ఐలను బదిలీలు చేస్తూ ఎస్పీ ఎం.దీపిక సోమవారం ఆదేశాలు జారీచేశారు. వీఆర్‌లో ఉన్న ఎ.సన్యాసినాయుడును పూసపాటిరేగకు, ఆండ్ర ఎస్‌ఐ బి.గణేష్‌ను డీసీఆర్‌బీకు, వీఆర్ అటాచ్డ్ కొత్తవలసలో ఉన్న బి.దేవిని ఆండ్రకు, సీసీఎస్‌లో ఉన్న ఎస్.సుదర్శన్‌ను కొత్తవలసకు, టూటౌన్ ఎస్‌ఐగా ఉన్న ఐ.దుర్గాప్రసాద్‌ను సీసీఎస్‌కు, ఎస్.కోట అటాచ్డ్ వన్‌టౌన్ జె.తారకేశ్వరరావును వీఆర్ అటాచ్డ్ వన్‌టౌన్‌కు, విశాఖ సిటీలో పనిచేస్తున్న డి.తాతారావును భోగాపురం, డి.రామును కొత్తవలసకు, ఎ.మోహనరావును ఎస్.కోటకు బదిలీ చేశారు.

చెన్నైకు బ్లాక్‌రైస్ ఎగుమతి

బొండపల్లి: సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన దేశవాళీ బ్లాక్‌రైస్‌ను చెన్నైకు ఎగుమతి చేస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు సోమవారం తెలిపారు. రైతు ఈదుబిల్లి కృష్ణ తన మామిడితోటలో అంతర పంటగా సాగుచేసిన బ్లాక్ రైస్ (ధాన్యం) 500 కేజీలు కేజీ రూ.80 చొప్పున ఎగుమతి చేసినట్టు వెల్లడించారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఎల్ ప్రకాశరావు, ఎస్‌పీఎంయూ టీమ్ మెంబర్ రవిచంద్ర, ప్రకృతి వ్యవసాయం శాస్త్రవేత్త ఎం.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని అమ్మవారి కళ్యాణ మండపంలో సోమవారం లెక్కించారు. అమ్మవారి చదురు గుడి హుండీల నుంచి 34 రోజులకు రూ.14,59,576 నగదు, 32 గ్రాముల 200 మిల్లీ గ్రాముల బంగారం, 401 మిల్లీ గ్రాముల వెండి లభించిందని ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

60 ఏళ్ల వృద్ధురాలికి మోకాళ్ల మార్పిడి

- సర్వజన ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స చేసిన వైద్యురాలితో ఆర్థో డాక్టర్ మణి కుమార్, సూపరింటెండెంట్ అనిలా సునందని

విజయనగరం ఫోర్ట్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మొట్టమొదటి సారిగా మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మణికుమారి(60) కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. కొద్దిరోజుల క్రితం ఆమె ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఎముకల విభాగంలో చూపించుకుంది. ఆమెను పరీక్షించిన వైద్యులు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. దీంతో ఆమెను ఎముకల విభాగంలో చేర్పించారు. సోమవారం ఆమెకు ఆస్పత్రిలో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కార్పొరేట్ ఆస్పత్రిలో చేసే మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో తొలిసారిగా నిర్వహించడంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

కలెక్టర్ చొరవ అభినందనీయం



నిర్వాసితులకు పట్టాలను అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ చొరవ అభినందనీయమని వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ కొప్పర అమృతం అన్నారు. 1975వ సంవత్సరంలో వీరఘట్టంలో 75 సెంట్ల భూమిని తాను కొనుగోలు చేశామని, 2002వ సంవత్సరంలో ఉద్యోగ విరమణ తరువాత ఇల్లు, క్లినిక్ నిర్మాణం చేయాలని ప్రయత్నం చేసేందుకు సిద్ధపడగా, ఆభూమి 22(ఎ)లో ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారన్నారు. ఆ భూమిని 22(ఎ) నుంచి తొలగించేందుకు అనేక ప్రయత్నాలు చేశానని, పూర్వ శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగామని, చివరగా పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోకి వస్తుందని తెలిపి రికార్డులను బదిలీ చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో గత వారం కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను కార్యాలయంలో కలిసి సమస్యను వివరించగా, తక్షణం సమస్యను పరిష్కరించి ఉత్తర్వులు జారీ చేశారని సంతోషం వ్యక్తం చేశారు.

కొత్తవలస నిర్వాసితులకు పట్టాల పంపిణీ

రైల్వే మూడవ లైన్ నిర్మాణంలో భాగంగా పార్వతీపురం పట్టణ పరిధి కొత్తవలసలో నిర్వాసితులైన 14 కుటుంబాలకు కలెక్టర్ నిషాంత్ కుమార్ తన కార్యాలయంలో సోమవారం పట్టాలు పంపిణీ చేశారు. వెంకంపేట అర్బన్ లే అవుట్‌లో నిర్వాసిత 14 కుటుంబాలకు పట్టాలు జారీచేశారు. దీంతో వారంతా హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, ఆర్‌డీఓ కె.హేమలత, కేఆర్‌సీ ఎస్‌డీసీ జి.కేశవ నాయుడు, తహసీల్దార్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు

- ఆర్టీఓ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన డీటీసీ రవీంద్రనాథ్



ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీటీసీ రవీంద్రనాథ్

విజయనగరం క్రైమ్: వాహన డ్రైవర్లందరూ క్రమం తప్పకుండా కంటిచూపు పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జీఆర్.రవీంద్రనాథ్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 82 మంది వాహన డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు, కంటిచూపు పరీక్షలను వైద్యులు ఉచితంగా నిర్వహించారు. కంటిచూపుతో బాధపడుతున్న 18 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర పుష్పగిరి వైద్యులతో పాటు ఆర్టీఓ ఎస్.రమేష్, ఎంవీఐ ఎ.వి.రమణ, యు.దుర్గాప్రసాద్, కేఆర్ఎస్.ప్రసాద్, వి.శ్రావ్య, వి.ఐశ్వర్యలక్ష్మి, కార్యాలయ పరిపాలనాధికారిణి డి.మంజుల, రోడ్డు భద్రత డాక్టర్ జి.సాయికుమార్, ఎమ్.శ్రీధర్, కార్యాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

- జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉత్తరాంధ్ర స్థాయిలో సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న రీజనల్ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రచార పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ రావుతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీజనల్ జాబ్ మేళాలో ఐటీ సెక్టారీ, ఫార్మా, మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్, బ్యాంకింగ్ మరియు ఫైనాన్స్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, రిటైల్, మార్కెటింగ్, లాజిస్టిక్స్, రిటైల్ జ్యూవలరీ తదితర 87 బహుళ జాతి కంపెనీల్లోని 5,892 ఖాళీలను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. మేళాకు పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకావొచ్చని తెలిపారు. స్కిల్ యూనివర్స్ లింక్లో, స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్టణం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రతిభను బట్టి రూ.15వేల నుంచి రూ.60 వేల వరకు వేతనాలు ఉంటాయని తెలిపారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి, రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారిణి రోహిణి, విజయనగరం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, విశాఖ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికృష్ణ చైతన్య, ప్లేస్‌మెంట్ అధికారులు రమేష్, భాస్కర్లు పాల్గొన్నారు.

స్కిల్ కోర్సులతో ఉద్యోగ అవకాశాలు



రిసోర్స్ పర్సన్స్‌లు, విద్యార్థులతో జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. ఏపీ ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ప్రోత్సాహంతో జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ డైలాగ్' అనే అంశంపై సోమవారం ప్రారంభమైన స్టూడెంట్స్ ఇంట్రాక్షన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. యువతకు ఉన్నత ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా 2020 నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి మైక్రోసాఫ్ట్ అనే సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుందని తెలిపారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులు అనుగుణంగా అడ్వాన్స్ కోర్సెస్‌ను నేర్చుకుని ఉత్తమ ప్లేస్మెంట్స్‌ను పొందాలని ఆకాంక్షించారు. జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ సదస్సుకు హాజరైన రిసోర్స్ పర్సన్‌లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ బి.రంగారెడ్డి (ఫిజీషియన్ మరియు హానరరీ ప్రొఫెసర్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్), ఐఐఎం లక్నో ప్రొఫెసర్ ఎస్.వెంకటరమణయ్య మట్లాడుతూ లోకల్ గవర్నెన్స్ గురించి విపులంగా తెలియజేశారు. స్వాతంత్ర్యం రాకముందే మహాత్మా గాంధీ లోకల్ గవర్నెన్స్ గురించి తెలియజేశారని, ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం, పారదర్శకత చాలా ముఖ్యమైన అంశాలని తెలిపారు. సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ జీజే నాగరాజు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.